రైతుకు బీమా భారం

- మండల రైతులపై రూ.అరకోటి ప్రీమియం భారం
- వరుస కష్టాలకు తోడు బీమా డబ్బు చెల్లించమంటున్న ప్రభుత్వం
- రైతులపై బీమా ప్రీమియం భారం లేకుండా చేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

పంటల బీమా పథకంపై రైతులకు మొండి చేయి చూపిన ప్రభుత్వం



గత ఏడాది అధిక వర్షాలతో దెబ్బతిన్న పంట (ఫైల్)

పెనమలూరు: రైతు సంక్షేమమే తమ లక్ష్యమని, రైతుల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు బూటకమని తేలిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా విషయంలో ప్రభుత్వం మొండి చేయి చూపింది. రైతులే స్వయంగా బీమా ప్రీమియం చెల్లించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేయటంతో రైతన్నల్లో ఆందోళన మొదలయింది.

వివరాలు ఇవీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో రైతులకు పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. గడచిన వైఎస్సార్ సీపీ పాలనలో రైతులు ప్రభుత్వ భరోసాతో వ్యవసాయం చేశారు. ఈ క్రాప్ నమోదు చేసిన వెంటనే రైతులకు బీమా కూడా ప్రభుత్వమే జమ చేసేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఇందుకు నిదర్శనంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సబంధించి పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని ప్రభుత్వం తేల్చేసింది.

రైతులు చెల్లించాల్సింది ఇలా

రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమాకు మంగళం పాడిన తరువాత కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని తెరపైకి తీసుకు వచ్చింది. ఈ పథకం కింద రైతు ఎకరాకు రూ.830, పసుపు రైతు ఎకరాకు రూ.1100 బీమా చెల్లిస్తే బీమా కంపెనీలతో కేంద్ర ప్రభుత్వం నేరుగా ఒప్పందం చేసుకుంటాయని చెబుతున్నారు. ఈ నెల 31వ లేదీ లోపు పసుపు రైతులు, ఆగస్టు 15 నాటికి వరి సాగు చేసే ఖరీఫ్ రైతులు బీమా కట్టాలని డెడ్‌లైన్ పెట్టారు.

రూ.అరకోటి భారం

మండల రైతులు బీమా ప్రీమియం చెల్లిస్తే అర కోటి రూపాయల భారం పడనుంది. పెనమలూరు మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 5,550 ఎకరాలకు పైగా వరి, 400 ఎకరాల పసుపు సాగు చేయనున్నారు. వరికి ఎకరాకు రూ. 830, పసుపునకు ఎకరాకు రూ.1100 ప్రీమియం రైతులే చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన రూ.అర కోటి ప్రీమియం భారం రైతులపై పడనుంది. ప్రీమియం చెల్లించే రైతులు గ్రామ వీఏఏ వద్ద ఏరియా సోన్ సర్టిఫికెట్ తీసుకొని సచివాలయం లేదా మీసేవాలో ప్రీమియం ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది.

గత వైఎస్సార్ సీపీ పాలనలో..

2019- 2024 మధ్య కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పంటల బీమా పథకంతో జగన్ ప్రభుత్వం అనేక సందర్భాల్లో రైతులను ఆదుకుంది. రైతులు ప్రీమియం చెల్లించే పరిస్థితి లేకుండా అమలు చేసింది. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయన రైతులకు 2020- 2021 సంవత్సరంలో 798 మంది రైతులకు, 2021- 2022 సంవత్సరంలో 734 మంది రైతులకు వివిధ పంటలకు రూ. 7.88 కోట్లు బీమా సొమ్ము చెల్లించింది. పంటల నష్టపరిహారం(ఇన్‌పుట్‌సబ్సిడీ) కింద గత ప్రభుత్వం 1,664 మంది రైతులకు రూ.2.33 కోట్ల సాయం కూడా అందించింది. రైతులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉండటంతో రైతులు కష్టాల నుంచి బయటపడ్డారు. ఈ క్రాప్ చేయించుకున్న రైతులకు న్యాయం జరిగింది.

పంటల బీమా ఉచితంగా అమలు చేయాలి



పంటల బీమా పథకం రైతులకు ఉచితంగా ప్రభుత్వం అమలు చేయాలి. రైతులు పంటల సాగులో అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతుల కష్టాలు ప్రభుత్వం అర్థం చేసుకొని రైతులకు న్యాయం చేయాలి. ప్రీమియం చెల్లించకుండా బీమా అమలయ్యేలా చూడాలి.

– కోనేరు పూర్ణతులసీబాబు, రైతు, గోసాల

రైతులకు ద్రోహం చేసిన ప్రభుత్వం



రైతులకు అండగా ఉంటామని చెబుతున్న కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోంది. పంటల బీమా పథకం ప్రభుత్వం తక్షణం అమలు చేయాలి. రైతులపై బీమా ప్రీమియం భారం లేకుండా చూడాలి. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

– పోలవరపు రవి, రైతు, గోసాల

కూటమి ప్రభుత్వ తీరుతో..

రైతులు బీమా చేసే విషయంలో సందిగ్ధంలో ఉన్నారు. ప్రస్తుత కష్టాలకు తోడు ప్రీమియం అదనపు భారం అవుతుందంటున్నారు. గత ఏడాది అధిక వర్షాల కారణంగా మండలంలో 938 మంది రైతులకు పంటనష్ట పరిహారం దాదాపు 84 లక్షలు కూటమి ప్రభుత్వం రైతులకు ఇవ్వలేదు. వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని స్థితిలో కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించక, అటు పంట నష్ట పరిహారం ఇవ్వక పోతే పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేడు ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనమలూరు: కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ గ్రామంలో భాగ్యనగర్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం గ్రామంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. ఈ కారణంగా గ్రామంలో డీఎస్‌ఆర్‌కాలనీ, ఎస్సీ ఏరియా, ఎస్‌బీఐ కాలనీ, కానూరు మెయిన్‌రోడ్డు, సెయింట్ థెరిసా పాఠశాల ప్రాంతాలలో విద్యు సరఫరా నిలుపుతామని గ్రామస్తులు సహకరించాలని కోరారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయా ప్రాంతాల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం రామవరప్పాడులో రాజుల బజారు, సాయి బాబా ఆలయం ఏరియా, ఏలూరు రోడ్డు, రింగ్ ప్రాంతాల్లో ప్రసాదంపాడు బీఎస్ఎన్ఎల్ టవర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మానికొండ(గన్నవరం): మండలంలోని నందమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మానికొండ ఫీడర్‌లో నిర్వాహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మానికొండ గ్రామ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామ విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

క్లుప్తంగా

వక్ఫ్ భూముల్లో నాట్లు వేసేందుకు సన్నాహాలు



పెనమలూరు: వక్ఫ్ భూములకు ఇటీవల అధికారికంగా కౌలు వేలం నిర్వహించినా కొందరు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. పెదపులిపాక గ్రామంలో ఉన్న దాదాపు 12 ఎకరాల భూమికి తహసీల్దార్ కౌలు వేలం పాట జరిపారు. ఈ భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించరాదని ఆదేశించారు. అయితే కొందరు వ్యక్తులు వక్ఫ్ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి వరి నాట్లు వేయటానికి సన్నాహాలు చేయటంతో అధికారులు, వక్ఫ్ బోర్డు సీరియస్‌గా తీసుకుంది. వక్ఫ్ భూములు ఆక్రమించినవారిపై కఠిన చర్యలు తీసుకోవటమే కాకుండా నాట్లు వేస్తే ధ్వంసం చేయటానికి కూడా అధికారులు రంగం సిద్ధం చేశారు.

కృత్రిమ కాలు అందజేత



గన్నవరం: పేదల అభ్యున్నతికి మానవత స్వచ్ఛంద సంస్థ పాటుపడుతుందని గన్నవరం యూనిట్ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. అంగవైకల్యంతో బాధపడుతున్న గన్నవరానికి చెందిన కొనకళ్ల రామతులసమ్మకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సౌజన్యంతో కృత్రిమ కాలును అందజేశారు. తోటపల్లి హీల్ సంస్థలో కృత్రిమ కాలు తయారు చేయించి అందజేసినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కన్వీనర్ కర్రా వరప్రసాదరావు, కార్యదర్శి వీవీ.కృష్ణమోహన్, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ సారె సమర్పణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గాయత్రి, సరస్వతి అమ్మవార్లకు మహిళలు ఆషాఢ సారె మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్‌లోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానం నుంచి పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, పండ్లతో ఆషాఢ సారె తీసుకుని ఊరేగింపుగా సత్యసాయి మందిరానికి చేరుకున్నారు. లలితా సహస్రనామ పారాయణం, అష్టోత్తరం, భజనలు నిర్వహించారు. ఆలయంలోని గాయత్రి అమ్మవారికి, సరస్వతి తల్లికి ఆషాఢ సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు, సభ్యులు మామిడి రాము, కోసూరు సుకుమార్, చలమలశెట్టి వెంకటేశ్వరరావు, నండూరి వేణు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతున్న ప్రభుత్వం



ఉయ్యూరు: ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని సుందరమ్మపేటలో విద్యుత్‌చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లపై శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూ అప్ చార్జీలతో సామాన్యులపై విద్యుత్ భారాన్ని మోపి ప్రజల కష్టాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ.15,485 కోట్ల భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, నాయకులు కె.శివనాగేంద్రం, రాజేష్, సుబ్బారావు, లక్ష్మణరావు, కీర్తి, గోపాల్ పాల్గొన్నారు.

ధ్యానంపై శిక్షణ

గన్నవరం రూరల్: మానవుడు ధ్యాన సాధన ద్వారా దైవ స్థితికి చేరుకోవచ్చని గన్నవరం పత్రీజీ సరస్వతి పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు ఎం.నాగ రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పురుషోత్తపట్నం సాయిబాబా మందిరంలో పత్రీజీ అమృతోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉచిత ధ్యాన, జ్ఞాన బోధన శిక్షణలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సర్వం తనలోనే ఉన్నదని తానే ఆత్మ పదార్థం అని మానవుడు తెలుసుకోవాలన్నారు. ధ్యాన సాధన ద్వారా ఆ దైవ స్థితికి మనిషి చేరుకోవచ్చని, దానిలో భాగంగా గ్రామ ప్రాంతాల్లో ధ్యాన శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. పురుషోత్తపట్నం సరస్వతీ పిరమిడ్ ధ్యాన కేంద్రం భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యల వెల్లువ



నున్నలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో వినియోగదారులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నున్న గ్రామానికి చెందిన సొసైటీ మాజీ ప్రెసిడెంటు భీమవరపు సుబ్బారెడ్డి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు గాను తనకు రూ.34 వేల విద్యుత్ బిల్లు వచ్చిందని ఆ బిల్లు చెల్లించాలని నోటీసులు పంపినట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ బిల్లును పరిశీలించిన అధికారులు 2010వ సంవత్సరంలో రూ.10 వేలు బిల్లు చెల్లించాల్సి ఉందని, అప్పుడు వ్యవసాయ కనెక్షన్‌ను వేరే దానికి ఉపయోగించినందుకు పెనాల్టీ విధించినట్లు అధికారులు తెలిపారు. ఆ బిల్లును తగ్గించి చెల్లించే సదుపాయాన్ని అదాలత్‌లో పాల్గొన్న అధికారులు తెలియజేయడంతో సమ్మతించారు. విలేజి కంఢ్రికకు చెందిన రాకేష్ అనే వినియోగదారుడు తనకు స్మార్ట్ విద్యుత్ మీటర్ వలన రూ.12 వేల బిల్లు వచ్చిందని చెప్పగా పరిశీలించిన అధికారులు రూ.3,935 బిల్లు తగ్గించారు. హనుమాన్ జంక్షన్ నుంచి వచ్చిన మరో వినియోగదారుడు తనకు విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందని చెప్పడంతో దాన్ని కూడా తగ్గించారు. స్మార్ట్ మీటర్ల వలన బిల్లులు అధికంగా వస్తున్నాయని, వాటిని ఏర్పాటు చేయవద్దని పలువురు వినియోగదార్లు అధికారులకు తెలియజేశారు. నున్న గ్రామంలో లోటల్టేజి సమస్య తీర్చి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు అధికారులు వినతి పత్రం అందజేశారు. రిటైర్డు జడ్జి విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్‌మీటరు రీడింగ్ టైమ్‌కు తీయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావు, డీఈ పి.హరిబాబు, మెంబర్ సునీత, స్థానిక ఏఈ ఎ.శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై నిలదీత



సమావేశంలో ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు

విజయవాడరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన శుక్రవారం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. సమస్యలపై అధికారులను ఎంపీటీసీలు నిలదీశారు. సమావేశంలో ప్రభుత్వ పథకాల గురించి సమీక్షా మాత్రమే నిర్వహించడంతో సభ్యులు కొంత అసహనానికి గురయ్యారు. మండల పరిషత్ నిధులు కేటాయింపుల్లేవ్, కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులు గురించి సమావేశంలో ప్రకటించలేదు. విద్యాశాఖకు సంబంధించి సమీక్ష జరుగుతున్న సందర్భంలో తల్లికి వందనం పథకం ఎంత మంది విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసిందని ఎంపీటీసీ సభ్యురాలు విజయ సుగుణ ప్రశ్నించారు. దీంతో ఎంఈవో సమాధానం చెప్పలేకపోయారు. ఈ నెలాఖరు వరకు టైమ్ ఉందని వచ్చే మీటింగ్ నాటికి పూర్తి వివరాలను అందిస్తామని ఎంఈఓ వెంకటరత్నం సమాధానం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పీ4 సర్వేలో 4,747 కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ తెలిపారు. ఈ విషయమై గొల్లపూడి ఎంపీటీసీ సభ్యుడు పి.ఆదినారాయణ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతుందన్నారు. చిరు వ్యాపారులకు కూడా వేలాది రూపాయల విద్యుత్ బిల్లులు వస్తున్నాయని దాంతో వారు ఆ బిల్లులు చెల్లించలేక పేదలవుతున్నారని విమర్శించారు. ఏలూరు రోడ్డులో నేషనల్ హైవేపై (ఎయిర్ పోర్టు క్యారిడార్) వీఐపీలు రాకపోకలు సాగిస్తున్నారని, నిత్యం పారిశుద్ధ్య పనులు, డ్రైయినేజీ పనులు నిర్వహించాలంటే గ్రామ పంచాయతీలకు కష్టంగా ఉందని ఎనికేపాడు గ్రామ సర్పంచి పూర్ణచంద్రరావు అడిగారు. ప్రభుత్వం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ, డెప్యూటీ ఎంపీడీఓ లు తెలియజేశారు. మండల పరిషత్ పరిధిలో 23 ప్రభుత్వ శాఖలుండగా వారిలో సగానికి పైగా అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, కోఆప్షన్ సభ్యులు ఆల్తాఫ్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అమ్మవార్లకు శాకంబరి అలంకరణ



శాకంబరి అలంకరణలో అమ్మవారు



రామవరప్పాడులో కూరగాయల అలంకరణలో పేరంటాలమ్మ

పెనమలూరు: యనమలకుదురు గ్రామం లాకు సెంటర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం శాకంబరి అలంరణ చేశారు. దేవదాయ శాఖ, ఆలయ కమిటీ, స్థానిక భక్తుల సహకారంతో అమ్మవారికి పలు రకాల కూరగాయాలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఆలయ పూజారులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శాకంబరీదేవిగా పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవార్లు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అందజేసిన పలు రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. వేకువ జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పేరంటాలమ్మను దర్శించుకున్నారు. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సతీ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక, ఇరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడ మున్సిపల్ హైస్కూల్‌లో పని చేస్తున్న ఎం.శ్రీనివాసరావు తన బైక్‌పై గుడివాడ నుంచి విజయవాడకు వెలుతుండగా పోరంకి వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని ఆటో అతనిని ఢీ కొట్టి ఆగకుండా వెళ్లి పోయింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న శ్రీనివాసరావు రోడ్డు పైపడిపోవటంతో గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

9 గ్రామాల్లో ల్యాండ్ కన్వర్షన్‌కు అనుమతి

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలంలో తొమ్మిది గ్రామాల్లో అవుటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదనలు అమలులో ఉన్న నేపథ్యంలో వ్యవసాయ భూముల నుంచి వ్యవసాయేతర భూములకు ల్యాండ్ కన్వర్షన్‌కు అనుమతించనున్నట్లు తహసీల్దారు విమలాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దఅవుటపల్లి, పొట్టిపాడు, ఆత్కూరు, తేలప్రోలు, వేంపాడు, తరిగొప్పుల, వెల్దిపాడు, వెన్నుతల, మానికొండ గ్రామాల భూములకు ల్యాండ్ కన్వర్షన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేద వర్గాలకు అండ వైఎస్సార్ సీపీ జెండా



ఏసుపాదం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంకిపాడు: పేద వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ జెండా నిలుస్తుందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన దేవరపల్లి ఏసుపాదం ఇటీవల మృతి చెందటంతో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం పరామర్శించారు. నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి వితరణతో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మేధావుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పిడికిటి రామకోటేశ్వరరావు, రాష్ట్ర మహిళా నేత రామినేని రమాదేవి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్ మాట్లాడుతూ పేద వర్గాలకు ఏ చిన్న కష్టం వచ్చినా వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలకు రక్షణగా నిలుస్తుందన్నారు. కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకు సాగాలని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు బండారు దుర్గారావు, మల్లెల వేణు, తొడుసు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానా

హనుమాన్‌జంక్షన్ రూరల్: మూడేళ్ల బాలుడు మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌కు నూజివీడు కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. బాపులపాడు మండలం వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ పరిధిపూర్‌కు చెందిన జజ్జర్ ఆలీ 2021 సెప్టెంబర్ 9వ తేదీన తన కుటుంబంతో కలిసి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో కేరళ విహార యాత్రకు వెళ్లుతూ మార్గమధ్యంలో బాపులపాడు మండలం అంపాపురంలోని ఓ హోటల్ వద్ద భోజన విరామం కోసం ఆగారు. భోజనం ముగించుకుని తిరిగి బస్సు బయలు దేరుతున్న తరుణంలో తండ్రి జజ్జర్ ఆలీతో పాటుగా బస్సు ఎక్కుతున్న కుమారుడు సలీం ఆలీ (3) కింద పడి పోయాడు. దీంతో సలీం ఆలీపై బస్సు టైర్లు ఎక్కటంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి చార్జిషీటు ఫైల్ చేశారు. ఈ కేసులో నూజివీడు న్యాయస్థానం బస్సు డ్రైవర్ స్నేహిల్ జోసెఫ్‌పై నేరం రుజువు కావటంతో 15 రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు.

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం జర భద్రం



భారీ వర్షానికి అధ్వానంగా మారిన గోసాల- మద్దూరు రోడ్డు

కంకిపాడు: అసలే అధ్వానంగా ఉండే రహదారి. దీనికి భారీ వర్షం తోడవ్వటంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా తయారైందని వాహదారులు వాపోతున్నారు. ఆదమరచి వాహనాలు నడిపితే ప్రమాదం బారిన పడినట్టే. ప్రయాణ అగచాట్లకు గోసాల- మద్దూరు రోడ్డు మార్గం కేరాఫ్‌గా మారింది. విజయవాడ- దివిసీమ కరకట్ట నుంచి విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న మద్దూరు- గోసాల ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారుతోంది. ఏళ్ల తరబడి రోడ్డు అభివృద్ధికి మోక్షం లభించటం లేదు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక రూ.6.50 కోట్లతో అంచనాలను రూపొందించి నివేదించారు. నెలలు గడిచిపోతున్నాయే తప్ప ఒక్క రూపాయి గ్రాంటు కూడా విడుదల కాలేదు. ఫలితంగా రోడ్డు దారి మొత్తం పెద్ద పెద్ద గోతులమయంగా మారింది. మార్జిన్‌లు కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రోడ్డు గుంతలోల భారీగా వర్షంనీరు నిలిచిపోయి చిన్నపాటి జలాశయాలను తలపిస్తోంది. ఎంత పెద్ద గొయ్యి ఉందో తెలీని పరిస్థితుల్లో ద్విచక్రవాహనదారులు ప్రమాదం అంచున ప్రయాణం సాగిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుఝామున కురిసిన భారీ వర్షానికి రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా వర్షం నీరు నిలిచిపోయి రాకపోకలు సాగక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇబ్బందులను గుర్తించి రోడ్డుకు మోక్షం కల్పించాలంటూ వేడుకుంటున్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి



పెనమలూరు: పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందుకు సాగాలంటే సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హెచ్‌సీఎల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ అన్నారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ ఫ్రెషర్స్ డే సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కొత్తగా ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం, స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 48 సంవత్సరాల చరిత్ర కలిగిన సిద్ధార్థ అకాడమీ హయ్యర్ ఎడ్యుకేషన్ ఎందరో విద్యార్థులకు బాసటగా నిలిచిందన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలు, భరతనాట్యం, వివిధ రకాల డ్యాన్స్‌లు చేశారు. శివప్రసాద్‌ను కాలేజీ యాజమాన్యం సత్కరించింది. ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, డైరెక్టర్ బి.పాండురంగారావు, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, డీన్‌లు, వివిధ విభాగాధిపతులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.